క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక


ఇంద్రగోపాల్, అధ్యక్షుడు


ఆసీఫ్, ప్రధాన కార్యదర్శి

టేకుమట్ల: పీఆర్‌టీయూ తెలంగాణ నూతన మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఆరె రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ వివరాలను వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా దండ్రె ఇంద్రగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఆసీఫ్, ఉపాధ్యక్షుడిగా రాజమోహన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరె రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తామని, పీఎస్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు సాధించడం, పీఆర్సీ, ఎస్‌జీటీలకు కామన్ మెరిట్ వంటి సమస్యల పరిష్కారంలో ముందుంటామన్నారు. అలాగే నూతన మండల కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిరాములు, రాష్ట్ర బాధ్యులు కోనేటి దయాకర్, బిట్ల వేణు, చాగంటి ఆనంద్ పాల్గొన్నారు.

పండ్లతో అలంకరణ



కాటారం: శ్రావణమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి పలు రకాల పండ్లతో మంగళవారం మహా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రానికి చెందిన వెన్నపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, స్వరూప దంపతుల ఆధ్వర్యంలో 11 రకాల పండ్లతో అత్యంత సుందరంగా అలంకరించారు. అంతకముందు ఆలయ పురోహితుడు నిఖిల్ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చీర్ల శ్రావణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు మద్ది నవీన్, పులి అశోక్, బొల్లం రాజబాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. చిట్యాల మండలం కాల్వపల్లి నుంచి రేగొండ మీదుగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని కోళ్ల సురేందర్, డ్రైవర్ రాజేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రేగొండ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా మండలకేంద్రంలో రెండు ఇసుక డంపులు నిల్వ ఉంచారు. మంగళవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

సీసీ కెమెరాల నీడలో పల్లెలు


సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)


టేకుమట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కెమెరాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న గ్రామస్తులు

టేకుమట్ల: నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతుంది. పట్టణాలతో పాటు పల్లెల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు సహకరిస్తూ గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో గ్రామాల్లో దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న సందర్భంలో ఎలాంటి ఆధారాలు లేక పోలీసులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యేది. ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు, దొంగతనాలకు పాల్పడినా సులభంగా కనుక్కోవడానికి వీలుంటుంది. ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. టేకుమట్ల, రేగొండ మండల కేంద్రాలతో పాటు ఆయా మండలాల్లోని పలు గ్రామాలలో పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.

సీసీ కెమెరాలతో ఛేదించిన కేసులు..

- రేగొండ మండలం మడ్తపల్లిలో బంగారం చోరీ కేసులో పోలీసులు నిందితులను పట్టుకున్నారు.
- రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో మెడికో విద్యార్థి అనుమానాస్పద మృతిని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు.
- ఇటీవల రూపిరెడ్డిపల్లిలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ట్రాక్టర్‌తో పరారైన వ్యక్తిని పోలీసులు గుర్తించారు.
- చిట్యాలలో నకిలీ మావోయిస్టుల పేరుతో వెలసిన వాల్ పోస్టర్‌లను సీసీ ఫుటేజీ ఆధారంగా ఛేదించి, నిందితులను పట్టుకున్నారు.
- టేకుమట్ల మండల కేంద్రంలో ఎలక్ట్రీషియన్ వద్దకు మరమ్మతు కోసం తీసుకువచ్చిన వ్యవసాయ బావి మోటార్ చోరీలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు.
- టేకుమట్ల–రాఘవరెడ్డిపేట ప్రధాన రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ప్రమాదానికి కారణమైన వ్యక్తిని, వాహనాన్ని గుర్తించారు.
- మొగుళ్లపల్లి మండలంలోని బంగ్లాపల్లికి చెందిన రైతును మొట్లపల్లి పాల వ్యాన్ ఢీకొట్టి వెళ్ళగా సీసీ ఫుటేజీ ఆధారంగా కేవలం గంటలోనే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి కేసును ఛేదించారు.

ధైర్యంగా ఉంటున్నాం..



గతంలో పల్లెల్లో దొంగతనాలు ఎక్కువగా ఉండేవి. ఏదైన దొంగతనం జరిగిందంటే ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాల ఏర్పాటుతో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే ఎవరైనా దొరికిపోతారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు కూడా తగ్గిపోయాయి. బస్టాండ్ ఆవరణంలో మాకు పండ్ల దుకాణం ఉంది. సీసీ కెమెరాలు ఉండడం వల్ల పండ్లను రోడ్డుపైన్నే ఉంచుతున్నాం. సీసీ కెమెరాల వల్ల ధైర్యంగా ఉంటున్నాం.

– సరిగొమ్ముల ప్రభాకర్, పండ్ల వ్యాపారి టేకుమట్ల

అవగాహన కల్పిస్తున్నాం..



మండలంలో ఇది వరకు కొన్ని గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి, పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరిస్తున్నారు. తప్పకుండా త్వరలోనే మండలం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉండబోతుంది.

– గోగికారి ప్రసాద్, ఎస్సై టేకుమట్ల

పీఏసీఎస్‌లో రైతులకు మోసం


మాట్లాడుతున్న మల్లేశ్

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధికారులు రైతులను మోసం చేస్తున్నారని వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన ఏలేటి చంద్రయ్య అనే రైతు గతంలో సహకార సంఘంలో కొంత డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో గతంలో తీసుకున్న డబ్బులతో పాటు వడ్డీతో సహా మొత్తం 2016 సంవత్సరంలో రూ.1,62,92లు చెల్లించి రశీదు కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇటీవల పరపతి సంఘం కార్యాలయానికి వెళ్లి చూడగా అందులో మళ్లీ అప్పు ఉన్నట్లుగానే చూపేడుతుందని వాపోయారు. అలాగే కొంత మంది రైతులు గతంలో పరపతి సంఘం కార్యాలయంలో సభ్యత్వం తీసుకున్నారు. తీసుకున్న రైతుల ఆధార్ కార్డు ఒకే ఇంటి పేరు ఉంటే ఆధార్ కార్డుపై మరో రైతుకు అక్రమంగా రుణాలు ఇచ్చారని ఆరోపించారు. ఇలా వందల మందికి రుణాలు ఇవ్వడం వలన సభ్యత్వం తీసుకున్న రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అలాగే టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన కందుల రవీందర్‌కు చెందిన ఆధార్ కార్డుపై మరో వ్యక్తికి రూ.46 వేలు రుణం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు సహకార పరపతి సంఘంలో ఇలాంటి ఘటనలు మరెన్నో అక్రమాలు జరిగాయని జిల్లా అధికారులు వాటిని బయటకు తీసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కందుల రవీందర్, నరసింహారెడ్డి, జగన్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

మహాముత్తారం: రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం మండలంలోని నిమ్మగూడెం గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేసే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవైసీ మండల ఇన్‌చార్జ్ నజీర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ అభ్యర్థి జాటోత్ వంశిరాజ్, వినయ్, విజయ్, రఘుపాల్ రాకేష్‌నాయక్, రాజేంద్రప్రసాద్, రవి, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 4న అధ్యక్షుడి ఎన్నిక

భూపాలపల్లి రూరల్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడి ఎన్నిక సెప్టెంబర్ 4న నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు ఐతు రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోటీ చేయుటకు అర్హతలు, ఎన్నికల నిబంధనల కోసం, ఇతర వివరాలకు 98489 39258 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి దాతల సాయం


హనుమాన్ ఆలయానికి చుట్టూ వేసిన సీసీ


ప్రసాదశాల నుంచి రోడ్డు వరకు వేస్తున్న సీసీ రోడ్డు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ప్రసాదశాల నుంచి కట్టమీద ఆంజనేయ స్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి దాతలు కాళేశ్వరానికి చెందిన గందెసిరి మధుసూదన్, మంచిర్యాలకు చెందిన సంతోష్ సాయం అందించారు. ఈ మేరకు మంగళవారం రోడ్డు పనులను వారు ప్రారంభించగా మంగళవారం ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు. రూ.1.30లక్షలతో సుమారు 90మీటర్ల పొడవుతో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటు మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఉట్ల సేవ

రేగొండ: మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు (బుధవారం) గోకులాష్టమి సందర్భంగా ఉట్ల సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


గణపురం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని కోటగుళ్లను సందర్శించడానికి వచ్చిన గవర్నర్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లు, రేగొండ మండలంలోని పాండవుల గుట్ట, బుగులోని వెంకటేశ్వరస్వామి, చిట్యాల మండలంలోని నాపాక ఆలయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ భవన నిర్మాణం జరుగుతుందని అందులో అవసరమయ్యే (ఎస్‌డీపీ)సింగిల్ డోనర్ ప్లేట్‌లేట్ మిషన్ లాగే (పీఆర్‌పీ)ప్లేట్‌లేట్ రిచ్ ప్లాస్మా మిషన్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహబుబూబాద్ ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ రాహుల్ శర్మ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

రాష్ట్రంలో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం గణపురం మండలంలోని బుద్దారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా మార్చడానికి నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

భూపాలపల్లి రూరల్: జీవిత బీమా ఇన్సూరెన్స్‌ల పాలసీలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని ఎమ్మెల్యే సత్యానారాయణరావు సూచించారు. శ్రీరామ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి అనివార్య కారణాలతో మృతి చెందిన కుటుంబాల సభ్యులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేయగా వారికి ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


కాటారం: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


మొగుళ్లపల్లి: పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నవత

కాటారం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి మౌనిక సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గొల్లపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తిరుపతిరెడ్డి, సుమన్, సీహెచ్‌ఓ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్‌ఎంలు నాగరాణి, సునీత, పార్వతి, సరిత, సుజాత, అరుణ పాల్గొన్నారు.

పరిశుభ్రత లోపిస్తే రోగాలు

పలిమెల: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపిస్తే రోగాలు తప్పవని అంబటిపల్లి హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సోనాజీ అన్నారు. మండల కేంద్రం సమీపంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన గొత్తికోయలగూడాన్ని మంగళవారం సందర్శించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోనాజీ మాట్లాడుతూ.. గొత్తికోయగూడంలో ఉన్న పలువురు వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం ద్వారా ఎలర్జీ, సర్ది, దగ్గు లాంటి రుగ్మతలతో కూడిన సీజనల్ వ్యాధులతో బాధపడుతన్నారని అన్నారు. అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పలుమార్లు ఈ గొత్తికోయగూడాన్ని సందర్శించి వారికి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించినా వారు పాటించలేకపోతున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలన్నారు. వర్షం నిల్వ నీటిలో దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


టేకుమట్ల: అంకుషాపూర్..


పలిమెల: దోమల నివారణ మందు చల్లుతున్న సిబ్బంది

టేకుమట్ల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని అంకుషాపూర్‌లో డాక్టర్ దొమ్మటి ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన జ్వర పీడితుల రక్త నమూనాలను సేకరించి, మందులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వల్ల డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా వంటి జ్వరాలు వస్తున్నాయన్నారు. ఇంటి పరిసరాలల్లో నీటి నిల్వలను అరికట్టి ఇంట్లో దోమ తెరలు వాడి దోమల నుంచి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దొమ్మటి ప్రియాంక, హెచ్‌ఓ జమాలుద్దీన్, హెచ్‌వీ విజయ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం సునీత, ఆశ కార్యకర్తలు కృష్ణవేణి, రమా, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి, ఇస్సిపేట గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్‌లో డాక్టర్ నవత, డాక్టర్ సంధ్య మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. అలాగే జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు తీసి ల్యాబ్ పంపించారు. హెచ్‌ఈఓ రేష్మ, సూపర్‌వైజర్ జమున, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్‌ఎం శ్రీలత, సునీత, భారతి పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు కంటి పరీక్షలు డాక్టర్ మహేశ్వరి, సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఈర్ల గట్టుమల్లికార్జున నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌లో ఆరవతరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు. జనవరి 28న పరీక్ష రాయగా అందులో 224 మార్కులతో ఎంపికయ్యాడు. విద్యార్థి స్థానిక గ్రీన్‌వుడ్ పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యనభ్యసించాడు. రెండు నెలలుగా 6వ తరగతిలో గుడ్‌మార్నింగ్ స్కూల్‌లో చదువుతున్నాడు. విద్యార్థిని గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల పరిధి దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మానస మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందే అవకాశం ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీ కృష్ణాష్టమి వేడుకలు


నైన్‌పాకలో ఉట్టి కొడుతున్న పిల్లలు


కాళేశ్వరం: రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని మంగళవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు ఉట్టి కొట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లోని పిల్లలు కృష్ణుడి వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో నాపాక దేవాలయ చైర్మన్ యాదండ్ల రాజయ్య, అర్చకులు పెండ్యాల ప్రభాకరాచార్యులు, యాదవ సంఘం నాయకుడు బావు గట్టయ్య, నక్క భాస్కర్, కట్టికోళ్ల రమేశ్, గౌరై అనిల్, నందికొండ దేవేందర్ రెడ్డి, రాజు, పాపయ్య, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధదేవాలయం శ్రీరామాలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయ అర్చక బృందం శ్రీ కృష్ణజననం, భాగవత అంతర్గత కృష్ణ జనన ఘట్టం పారాయణం, భజన, హారతి, మంత్రపుష్పంలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. బుధవారం ఉదయం 9గంటలకు రామాలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపు సేవ(గోపాల కాలువలు) నిర్వహించనున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు రామాచారి, ఫణీంద్రశర్మ, శరత్‌చంద్రశర్మ, మాజీడైరెక్టర్ అశోక్, మాచెర్ల సారయ్య, సంతోష్, రామన్న పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


రాజేశం(ఫైల్)

టేకుమట్ల: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బూర్నపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్నపల్లి గ్రామానికి చెందిన కొండ రాజేశం(49) అనే వ్యక్తి వడ్ల వ్యాపారం చేస్తుండే వాడని, ఈ క్రమంలో గత యాసంగి సీజన్‌లో జిల్లాలోని కాంటారంలో వడ్లను కొని నిల్వ చేసుకోగా వర్షాలకు తడిసి దాదాపు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దాంతో అప్పుల పాలైన అతడు మద్యానికి బానిసై ఈ నెల 14న అతడు వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వెంటనే చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కాగా, మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లన్న తెలిపారు.